క్లుప్తంగా

గ్రంథాలయం కొనసాగించాలని వినతి



వనపర్తిటౌన్: కొత్తగా జిల్లా గ్రంథాలయాన్ని ప్రారంభించినప్పటికీ పాఠకుల సౌకర్యార్థం శంకర్ గంజ్ శాఖ గ్రంథాలయాన్ని కొనసాగించాలని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలు శంకర్ గౌడ్ కోరారు. కొన్ని కారణాలతో ఆ గ్రంథాలయాన్ని మూసి ఉంచడంతో ఆ పరిసర ప్రాంత ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గ్రంథాలయాన్ని యథావిధిగా కొనసాగించేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే మేఘారెడ్డికి శుక్రవారం వినతి అందజేశారు. ఓంకార్, కందూరు నారాయణ రెడ్డి, జనజ్వాల, సత్తార్, గంధం నాగరాజు, ఎస్. చంద్రశేఖర్, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణతోనే మాదిగల అభ్యున్నతి సాధ్యం



వనపర్తిటౌన్: ఎస్సీ రిజర్వేషన్ల ఏబీసీడీ వర్గీకరణ విభజించాలని జరుగుతున్న పోరాటంలో అమరులైన మాదిగ అమరవీరుల త్యాగం వృథా కానివ్వం అని మహాజన్ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము చెన్నకేశవులు అన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్‌లో మాదిగ అమరవీరులకు ఎమ్మార్పీఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ జరగడం ద్వారానే మాదిగలు సామాజిక, రాజకీయ, ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని అన్నారు. అఖిల పక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్, గంధం గట్టయ్య, గంధం నాగరాజు, మీసాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం



కొత్తకోట: లాబర్థి సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పట్టణ కేంద్రంలోని 231వ పోలింగ్ బూత్‌లో కేంద్ర ప్రభుత్వం నుంచి నేరుగా లబ్దిదారుల ఖాతాలో రుణ సాయం పొందిన లబ్దిదారులను శుక్రవారం లాబర్థి సంపర్క్ మహబూబ్‌నగర్ పార్లమెంట్ కో కన్వీనర్ నరేందర్‌గౌడ్, కౌన్సిలర్ భరత్‌భూషణ్, రాఘవేందర్‌రెడ్డి, జనంపల్లి ఏలియాలు కలిసి ప్రధాని నరేంద్రమోదీ లేఖను చదివి వినిపించారు. కేంద్రంలో బీజేపీ పాలనలో నరేంద్రమోదీ నాయకత్వంలో దేశంలోని అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.

ఇద్దరికి తీవ్రగాయాలు

పెబ్బేరు రూరల్: మండల కేంద్రంలోని బైపాస్‌లోని ఆనంద్ భవన్ హోటల్ ఎదుట కర్నూల్ వైపు జాతీయ రహదారిపై గురువారం ద్విచక్ర వాహనాన్ని సైడ్ నుంచి లారీ ఢీకొట్టడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎర్రవల్లి మండలం, కోడేరుకు చెందిన బీచుపల్లి, లక్ష్మమ్మ టీవీఎస్ ఎక్స్‌ఎల్ బండిపై గురువారం కొత్తకోట మండలం, రామకృష్ణాపురంకి సొంత పనిపై వెళ్లి ఆదే రోజు పనులు ముగించుకొని సాయంత్రం గ్రామానికి వస్తున్నారు. పెబ్బేరు శివారులోని ఆనందభవన్ హోటల్ ఎదుట జాతీయ రహదారిపై హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న లారీ ముందు వెళ్తున్న ఎక్స్‌ఎల్ బండిని సైడ్ నుంచి ఢీకొట్టింది. దీంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిని అంబులెన్స్‌లో జోగుళాంబ గద్వాల జిల్లా ఆస్పత్రికి తరలించారు. వారిలో ఒకరిని మెరుగైన వైద్యం నిమిత్తం కర్నూల్ తీసుకెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శుక్రవారం బాధితుడి తమ్ముడు పరశురాముడు ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేశామని చెప్పారు.

పశువులకు టీకాలు

ఖిల్లాఘనపురం: రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పని సరిగా వేయించాలని మండల పశువైద్యాధికారి సుసా న్‌కేసి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని వెంకటాంపల్లిలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్రామంలో నిర్వహించిన క్యాంపులో మొత్తం 264 పశువులకు టీకాలు వేశామని చెప్పారు. మండలంలోని ప్రతి గ్రామంలో ఈ టీకాలు వేస్తామని చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి

అమరచింత: వేసవిలో మొక్కలు వాడుముఖం పట్టకుండా ప్రతినిత్యం నీటిని అందించి వాటిని సంరక్షించాలని ఎంపీడీఓ శ్రీనివాసులు సూచించారు. చెట్టుచెట్టుకు నీరు కార్యక్రమంలో భాగంగా మండలంలోని మస్తీపురంలో శుక్రవారం రహదారికి ఇరువైపుల నాటిన మొక్కలకు నీటిని అందించారు. మొక్కల సంరక్షణలో అలసత్వం కనబరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎక్కువ మందికి పని కల్పించాలి

పెబ్బేరు రూరల్: ఉపాధిహామీ పథకంలో ఎక్కువ మంది కూలీలకు పని కల్పించాలని ఎంపీడీఓ రవీందర్ సూచించారు. ఆయన మండలంలోని కంచిరావుపల్లిలో కొనసాగుతున్న ఉపాధి హామీలో జరుగుతున్న ఫీడర్ చానల్ పనులను శుక్రవారం ఏపీఓ అక్తర్‌నిసాబేగంతో కలసి పరిశీలించారు. నర్సరీలోని మొక్కలకు రెండు పూటల నీటిని అందించాలని సూచించారు.

నర్సరీల పరిశీలన

ఖిల్లాఘనపురం: గ్రామాల్లోని నర్సరీల్లో 100 శాతం మొక్కలు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ వెంకటాచారి అన్నారు. శుక్రవారం మండలంలోని ఉప్పరిపల్లి తదితర గ్రామాల్లో పర్యటించిన ఆయన ఉపాధిహామీ పనులు, గ్రామ నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో చేపట్టిన నర్సరీల్లో పూర్తిస్థాయిలో మొక్కలు ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లదే అన్నారు. మొలకెత్తిన మొక్కలు కూడా ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.



ఖిల్లాఘనపురం మండలం ఉప్పరిపల్లి నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకటాచారి



మసీపురంలో నీటిని అందిస్తున్న ఎంపీడీఓ

పల్స్‌పోలియోపై అవగాహన

పెబ్బేరు రూరల్: పల్స్ పోలియోపై మండలంలోని రాంపురంలో శుక్రవారం మండల ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ నెల 3, 4, 5 తేదీల్లో పల్స్‌పోలియో కార్యక్రమం ఉంటుందని చెప్పారు.

పోలియో విజయవంతం చేద్దాం

ఖిల్లాఘనపురం: మండలంలో ఈ నెల 3న ఆదివారం నిర్వహించే పోలియో చుక్కల కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతిఒక్కరూ సహకారం అందించాలని మండల వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. మండలంలో 5 సంవత్సరాల లోపు చిన్నారులు మొత్తం 2590 మంది ఉన్నారని చెప్పారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని గ్రామాల్లో ఆశాకార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వలంటీర్లు ఆస్పత్రి సిబ్బందిని సిద్ధం చేయాలని చెప్పారు.



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

తీర్మానాల ఆధారంగానే సీసీరోడ్ల నిర్మాణాలు

పాన్‌గల్: మండలానికి ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణాలను చేపట్టాలని ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీపీ ఛాంబర్‌లో ఎంపీడీఓ, ఎంపీఓ, జీపీల ప్రత్యేక అధికారులతో గ్రామాల వారీగా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాలకు మంజూరైన సీసీరోడ్ల నిర్మాణాలను గ్రామసభ తీర్మానాలు లేకుండా, జీపీ ప్రత్యేక అధికారికి తెలియకుండానే కొన్ని గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలను చేపడుతున్నారని, ఇది సరియైన పద్ధతి కాదన్నారు. కొందరు అధికారులు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, ఇది సరియైన పద్ధతి కాదన్నారు. గ్రామంలో అందరి ఏకాభిప్రాయం, తీర్మానాల అధారంగా సీసీ నిర్మాణాలు చేపడితే ఎలాంటి వివాదాలకు ఆస్కారం ఉండదన్నారు. ఏకపక్షంగా వ్యవహరించే అధికారులపై కలెక్టర్‌కు పిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. వైస్ ఎంపీపీ కవిత, ఎంపీడీఓ కోటేశ్వర్, ఎంపీఓ రఘురాములు, ఏపీఓ కుర్మయ్య, జీపీల ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి

విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

ఖిల్లాఘనపురం: జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి వివరాలను ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని జిల్లా సెక్టోరియల్ అధికారి శేఖర్ అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని గౌతమి, సిద్ధార్థ, శాంతినికేతన్ తదితర పాఠశాలలను పరిశీలించారు. పాఠశాలల్లోని హాజరు రిజిస్టర్లు పరిశీలించి అందులోని విద్యార్థుల పేర్లు ఆన్‌లైన్‌లో పరిశీలించారు. సక్రమంగా ఉండటంతో ఇలాగే కొనసాగించాలని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠశాలల్లో నిర్వహించే రికార్డుల్లో ఎలాంటి తప్పులు లేకుండా ఉండాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు కృషి చేయాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధికంగా ఫీజులు వసూలు చేయరాదన్నారు. తిరుపతిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, వెంకటేష్, తిర్పతయ్య, పవన్ ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలను పరిశీలిస్తున్న సెక్టోరియల్ అధికారి

ప్రీఫైనల్ పరీక్షల పరిశీలన

పాన్‌గల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పది ప్రీఫైనల్ పరీక్షలను శుక్రవారం ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. ప్రీఫైనల్ పరీక్షల్లో మంచి మార్కులు సాధిస్తే అదే నమ్మకంతో పబ్లిక్ పరీక్షల్లో కూడా మంచి మార్కులు సాధించే అవకాశం ఉంటుందన్నారు. అదే స్ఫూర్తితో సమయాన్ని వృథా చేయకుండా లక్ష్యానికి అనుగుణంగా పబ్లిక్ పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. పరీక్షలను భయం లేకుండా ప్రశాంత వాతావరణంలో రాయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం విష్ణువర్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



పాన్‌గల్‌లో పది ప్రీఫైనల్ పరీక్షలను పరిశీలిస్తున్న ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్

ఇంటర్ పరీక్షలకు ముగ్గురు గైర్హాజరు

పాన్‌గల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కొనసాగుతున్న ఇంటర్ పరీక్షల్లో మూడో రోజు శుక్రవారం ప్రథమ సంవత్సరం ఇంటర్ పరీక్షల్లో ముగ్గురు విద్యార్థులు గైర్హాజర్ అయినట్లు ఛీఫ్ సూపరింటెండెంట్ వెంకటేష్, డిపార్ట్‌మెంటల్ అఫీసర్ రాములు పేర్కొన్నారు. ప్రథమ సంవత్సరం పరీక్షలకు మొత్తం 115 మంది విద్యార్థులకు గాను ముగ్గురు విద్యార్థులు గైర్హాజరు అయినట్లు పేర్కొన్నారు. పరీక్షల సందర్భంగా 144 సెక్షన్ అమలులో ఉండటంతో కేంద్రం పరిసరాల్లో ఎవరూ గుమికూడకుండా స్థానిక ఎస్ఐ వేణు బందోబస్తు ఏర్పాటు చేశారు.

మాందాపూర్ భజన మండలికి బహుమతి

పాన్‌గల్: వికారాబాద్ జిల్లా కేశంపేట మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి భజన పోటీల్లో మండలంలోని మాందాపూర్ వీరభద్ర భజన మండలి సభ్యులు పాటలతో అందరిని ఆకట్టుకుని రెండో బహుమతి సాధించినట్లు మండల సభ్యులు శుక్రవారం తెలిపారు. రెండో బహుమతిగా రూ.15 వేల నగదుతో పాటు ప్రశంసా పత్రాలను అందుకున్నట్లు భజన మండలి సభ్యులు పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ హార్మోనిస్టుగా వెంకటేష్..



మాందాపూర్‌కి చెందిన వీరభద్ర భజన మండలి సభ్యులు ఈర్ల వెంకటేష్ హార్మోన్‌లో కనబర్చిన ప్రతిభను గుర్తించి రాష్ట్ర స్థాయి ఉత్తమ హార్మోనిస్టుగా ఎంపికచేశారు. అనంతరం ఘనంగా సన్మానించారు. జిల్లా స్థాయి కళాకారుల బృందం, గ్రామస్తులు అభినందించారు. భజన మండలి సభ్యులు నర్సింహరాజు, వెంకటేష్, మహేష్, శివ, చెన్నయ్య, రాంమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యకు తరలిన రామభక్తులు

ఆత్మకూర్: అయోధ్యలో వెలిసిన బాలరాముడిని దర్శించుకునేందుకు రామభక్తులు, బీజేపీ నాయకులు శుక్రవారం ఆత్మకూర్ నుంచి తరలివెళ్లారు. శ్రీరాముడిని దర్శించుకునేందుకు తమకు అనుమతి లభించిందని బీజేపీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అశ్విన్‌కుమార్ తెలిపారు. విష్ణువర్ధన్‌రెడ్డి, రఘు, సమద్, వెంకట్రాములు, లక్ష్మీనారాయణ తదితరులు వెళ్లారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

- ముగ్గురికి గాయాలు



కొత్తకోట రూరల్: అతివేగంతో వెళ్తున్న కారు వెనుక టైర్ పగిలిపోవడంతో కారు డివైడర్‌ను ఢీకొట్టగా.. ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన వనపర్తి జిల్లా కొత్తకోట సమీపంలో ఎన్‌హెచ్ 44పై శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన ముగ్గురు యువకులు కర్నూల్‌లో బంధువుల పెళ్లి వేడుకల్లో పాల్గొని తిరిగి కారులో హైదరాబాద్‌కు వెళ్తున్నారు. కొత్తకోట సమీపంలోకి రాగానే కారు వెనుక టైర్ పగిలిపోవడంతో వేగంగా ఉన్న కారు డివైడర్‌ను ఢీకొట్టి పల్టీలుకొట్టింది. దీంతో కారులోని ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను 108లో వనపర్తి ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం.

ధరణి సమస్యలు పరిష్కరిస్తాం

ఆత్మకూర్: ధరణిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని, తొమ్మిది రోజుల్లో ఫిర్యాదులన్ని పరిశీలిస్తామని తహసీల్దార్ రాజు అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తుల పరిశీలనను ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం, కలెక్టర్ తొమ్మిది రోజుల్లో దరఖాస్తుల పరిశీలన పూర్తిచేయాలని ఆదేశాల మేరకు కార్యక్రమం చేపడుతున్నామన్నారు. భూ సమస్యలు, తప్పు ఒప్పులు, ఇతరాత్ర దరఖాస్తులన్నింటిని పరిశీలించి నివేదించనున్నామని చెప్పారు. కార్యక్రమంలో డీటీ చానక్య, ఆర్ఐ జయమ్మ, జూనియర్ ప్రసాద్, వరుణ్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

పెబ్బేరు రూరల్: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టరును శుక్రవారం రాజనగరం వద్ద పట్టుకుని కేసు నమోదు చేశామని వనపర్తి రూరల్ ఎస్ఐ జలెందర్‌రెడ్డి తెలిపారు. వనపర్తి మండలంలోని రాజపేట పెద్దతండా హనుమాన్ వాగు నుంచి ఇసుకతో వస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు నాగవరం తండా వద్ద నిలిపివేశారు. అనుమతి పత్రాలు లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్, డ్రైవరు ముడావత్ సిద్ధూపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కాల్వలో పూడికతీత పనులు ప్రారంభం

కొత్తకోట రూరల్: మండల పరిధిలోని కనిమెట్ట, నిర్వేన్ గ్రామాల రైతులు బోరు బావుల కింద వరిసాగు చేశారు. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని, శంకర సముద్రం రిజర్వాయర్ కాల్వ ద్వారా నీటిని ఇస్తే, పంటలు ఎండిపోకుండా రక్షించుకుంటామని రైతులు కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. శ్రీనివాస్‌రెడ్డి దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డికి రైతుల సమస్యను వివరించడంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి కాల్వలో మట్టి తొలగించే పనులు చేయించారు.



కాల్వ పూడికతీత పనులు పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కనీస వసతులు కల్పించాలి



సమస్యలు తెలుసుకుంటున్న అకిలపక్ష ఐక్యవేదిక నాయకులు

పెబ్బేరు రూరల్: వనపర్తి పట్టణంలోని పీర్లగుట్టపై డబుల్‌బెడ్రూంలో నివసిస్తున్న ప్రజలకు కనీస వసతులు కల్పించాలని అకిలపక్షం ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్ కోరారు. అకిలపక్షం ఐక్య వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం పీర్లగుట్టపై డబుల్‌బెడ్రూంలో నివసిస్తున్న ప్రజలను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నీటి, కరెంటు, శానిటరీ, రోడ్ల సమస్యలు ఉన్నాయని అక్కడ నివసిస్తున్న బాధితులు వారి దృష్టికి తీసుకొచ్చారు. రాజకీయ నాయకులు రాజకీయాలు పక్కనపెట్టి ప్రజా సమస్యలు పరిష్కరించాలని అకిలపక్ష ఐక్య వేదిక డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు గోపాలకృష్ణ, తెలుగు యువత అధ్యక్షులు కొత్త గోల శంకర్, విష్ణు, ఎల్లయ్య, ధర్మసమాజ్‌పార్టీ అధ్యక్షుడు చెన్నకేశవులు, గధం వంశీ, బీఎస్పీ నాయకులు తదిలరులు పాల్గొన్నారు.

ప్రేమ పేరిట మోసం: నిందితుడికి రిమాండ్

ఆత్మకూర్: ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి పెళ్లి చేసుకుంటానని నాలుగేళ్లుగా కలసి ఉండి తీర వేరే అమ్మాయితో పెళ్లితంతు జరుపుతున్న యువకుడిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ నరేందర్ తెలిపారు. మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు అదే గ్రామానికి చెందిన యువతితో ప్రేమ, పెళ్లి పేరిట నాలుగేళ్లుగా సంబంధం ఏర్పరుచుకున్నాడు. పెళ్లి విషయంలో దాటవేస్తూ.. వస్తున్నాడు. అమ్మాయికి తెలుపకుండానే నాలుగు రోజుల కిందట మరో యువతితో ఎంగేజ్‌మెంట్ చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న యువతి గురువారం పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించి తనకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేశామని చెప్పారు. సీఐ శివకుమార్ నేతృత్వంలో శుక్రవారం నిందుతుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

'నాగర్‌కర్నూల్ పార్లమెంట్ టికెట్ మల్లురవికి ఇవ్వాలి'

వనపర్తిటౌన్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఎంపీ టికెట్ డాక్టర్ మల్లు రవికి ఇవ్వాలని టీపీసీసీ ఆర్గనైజర్ సెక్రెటరీ రాములు కోరారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గతంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఎంపీగా మల్లురవి గెలుపొందారని గుర్తుచేశారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల ముందు సీఎం రేవంత్ రెడ్డి చేసిన పాదయాత్రలో అడుగులో అడుగై పాదయాత్ర చేసిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మల్లు రవి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా, పట్టణ నాయకులు ప్రవీణ్ కుమార్, యాదయ్య, నందిమల్ల చంద్రమౌళి, కృష్ణ బాబు, డి. వెంకటేష్, మన్నెంకొండ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ అంగన్‌వాడీలదే..



వీపనగండ్లలో కమిటీల ఏర్పాటును ప్రారంభిస్తున్న వైద్యాధికారి రాజశేఖర్



రంగాపురంలో అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్న ప్రాసన చేస్తున్న సీడీపీఓ

తెలకపల్లి: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల బాగోగులను పరిరక్షించడంలో అంగన్‌వాడీ టీచర్లే కీలక బాధ్యతగా తీసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసారావు, స్థానిక మండల వైద్యాధికారి డాక్టర్ రాజశేఖర్ అన్నారు. శుక్రవారం సంగినేనిపల్లి, వీపనగండ్ల గ్రామాలతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో అంగన్‌వాడీ టీచర్లు, మహిళలతో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అన్ని గ్రామాల్లో అంగన్‌వాడీ స్థాయి పర్యవేక్షణ సహాయక కమిటీలను ఏర్పాటు చేయాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. నూతనంగా ఏర్పాటైన కమిటీల ద్వారా పోషకాహారంపై అవగాహన, రక్తహీనత, సాధారణ కాన్పులు, అన్నప్రాసన, అక్షరాస్యత, స్థానిక పండుగలు, సామూహిక శ్రీమంతాలు, ఆరోగ్య సమస్యలు-నివారణ చర్యలు అనే అంశాలపై ఈ కమిటీలు పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేందుకు కమిటీ

గోపాల్‌పేట: అంగన్‌వాడీలో సమస్యలు పరిష్కరించుకునేందుకు ఏఎల్ఎంఎస్సీ కమిటీ పనిచేస్తుందని, ఏమైనా సమస్యలు ఉంటే ఈ కమిటీ ఆధ్వర్యంలోనే పరిష్కారం పొందవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాణి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని నాలుగో సెంటర్‌లో ఏఎల్ఎంఎస్సీ కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీలో పదకొండు మంది ఉంటారని చెప్పారు. అంగన్‌వాడీ స్థాయిలో ఉన్న సమస్యలను సూపర్‌వైజర్ అడిగి తెలుసుకున్నారు. నెల నుంచి మూడు సంవత్సరాల పిల్లలకు బాలామృతం, ప్రతినెలా 16 గుడ్లు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతాలు

ఆత్మకూర్: గర్భిణులకు అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సీమంతాలు నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని తొమ్మిదో వార్డులోని అంగన్‌వాడీ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్ నాగరాజు, కౌన్సిలర్ రామకృష్ణ మాట్లాడారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ హసీన, మహిళలు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

కొత్తకోట రూరల్: గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యవంతమైన పిల్లలకు జన్మనిస్తారని హెచ్‌ఎం శంకర్‌గౌడ్ అన్నారు. పెద్దమందడి మండలంలోని మనిగిళ్లలో అంగన్‌వాడీ కేంద్రం-3లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులు తీసుకోవాల్సిన ఆహారం, ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఏఎన్ఎం చిన్నమ్మ, అంగన్‌వాడీ టీచర్లు రాధ, ప్రమీల, అరుణ, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

పెబ్బేరు రూరల్: ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని సీడీపీఓ లక్ష్మమ్మ అన్నారు. ఆమె శుక్రవారం శ్రీరంగాపురం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ-4 సెంటర్, పెబ్బేరు మండలంలోని రంగాపురంలోని అంగన్‌డీ సెంటర్‌లో ఏఎల్ఎంఎస్‌ఈ సమావేశం నిర్వహించారు.

లబ్ధిదారులకు న్యాయం చేయండి

అమరచింత: పద్దెనిమిది నెలల కిందట ఇచ్చిన ఇంటి స్థలాలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ.. గుడిసెలు వేసుకొని నివసిస్తున్న లబ్ధిదారులకు ప్లాట్‌ల హద్దులు చూపాలని సీపీఎం మండల కార్యదర్శి జీఎస్.గోపి, అజయ్, వెంకటేష్ డిమాండ్ చేశారు. దుంపాయికుంటలో గుడిసెలు నిర్మించికుని అక్కడే జీవిస్తున్న లబ్ధిదారులతో శుక్రవారం సమావేశం నిర్వహించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బుచ్చన్న, అనంతమ్మలతో పాటు పలువురు పాల్గొన్నారు.



దుంపాయికుంట లబ్ధిదారులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు



విద్యార్థుల ప్రతిభ

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన మండల స్థాయి గణిత ప్రతిభ పాఠవ పరీక్షకు ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న 40 మంది విద్యార్థులు పాల్గొని ప్రతిభను కనబర్చినట్లు ఎంఈఓ జయశంకర్ తెలిపారు. ప్రథమ బహుమతి రూ.1,000 హరిణి యూపీఎస్ అల్వాల, ద్వితీయ బహుమతికి పి.గౌతమ్‌కుమార్, జి.రాణి, సీపీఎస్ పెద్దమందడి, జి.ప్రశాంత్ ఒక్కొక్కరికి రూ.500 చొప్పున, తృతీయ బహుమతి వెంకటేష్ రూ.400 నగదును జిల్లా కో-ఆర్డినేటర్ యుగంధర్, హెచ్‌ఎం మంజులత, ఈశ్వరాచారి అందజేశారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం

పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్లపల్లి ప్రాథమిక పాఠశాలల్లో శుక్రవారం విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి స్వయంపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

